# జరుగుతున్న కథ

వాకు మల్లెపూలదండ నామె కందించాడు. అంటిస్తూ చెంపమీద చిటికె వేశాడు.

చిరుకోపంలో ఆ దండ లాక్కొని తిట్టి పరుగెత్తింది రామి.

రంగయ్యకు కొంచెం బాధ కలిగింది. మొద్దుపిల్ల దీనికి సరసమున్నా చాతకాదు.

అటు బంగళాలో అయ్యగార్నీ అమ్మగార్నీ చూస్తుంటే ప్చ్!

దేనికైనా పెట్టిపుట్టాలి!

కారు శబ్దమైంది రంగయ్య పరుగెత్తి గేటు తీశాడు.

లోనికెవరో సూటుతో పెద్దమనిషి వచ్చాడు కారును పోర్టికోలో వుంచి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. కాలింగ్ బెల్ నొక్కాడు.

రంగయ్య కృత్రిమమైన కాగితాల పూల అలంకరణను సరిచేస్తున్నాడు -

అమ్మగారు బయటకి వచ్చింది. మొన్న కట్టిన గులాబీ రంగు చీరె - అందమైన వెనుక గుండీలు గల జాకెట్, అజంతా స్టైల్ హేర్ డ్రెస్సింగ్ లిప్ స్టిక్. అమ్మగారు వచ్చి. వచ్చిన అతిధిని విష్ చేసింది. ఇరువురూ ఏవో మాట్లాడుకుంటున్నారు. ఒకటే నవ్వులు - కేరింతలు...

కొంత సేపటికి అయ్యగారు వచ్చారు - వారిని చూడగానే వచ్చిన అతిధి విష్ చేశాడు.

కాలుమీద కాలేసుకొని అమ్మగారు రంగయ్య ద్వారా తెప్పించిన కూల్ డ్రింక్ సిప్ చేస్తున్నది -

అయ్యగారు గర్వంగా అమ్మగారిని వచ్చిన అతిధికి పరిచయం చేశాడు.

అతిధి మళ్ళీ ఆమెకు షేక్‌హాండ్ ఇచ్చాడు.

లోపల టెలిఫోన్ మోగింది ..అయ్యగారు లోపలికి వెళ్ళారు -

రంగయ్య క్రోటను చెట్టు మొదట్లో ఉన్న వేప పురుగుల్ని ఏరి వేస్తున్నాడు....

వచ్చిన అతిథి అమ్మగారికి సిగరెట్ ఆఫర్ చేశాడు. అమ్మగారు కొంటెగా నవ్వి ఒక కన్ను సగం మూసి, క్రింది పెదవి తమాషాగా కొరుకుతూ లీలగా తిరస్కరించింది.

రంగన్న చెట్టు పని ముగించి లోనికి వెళ్ళాడు ...

ఆసాంతం ..

రంగన్న, రామి పూర్తిగా డిన్నర్ కార్యక్రమంలో లీనమైపోయారు ...

గ్లాసులు, ప్లేటులు, టేబిల్స్, వాటిపై గుడ్డలు అరేంజ్ చేయడం....

వరుస క్రమంగా పలావ్, బిర్యానీ, ఆలూ కూర, కోడి కూర, ఇతర పదార్థాలు స్వీట్లు అన్నీ వేర్వేరు బల్లలపై అమర్చడం. విశ్రాంతి లేకుండా పని చేస్తున్నారిద్దరూ.

వాకిట్లోకి నాలుగు కార్లు వచ్చి ఆగాయి. అందులోనుండి రంగురంగుల దుస్తులు ధరించిన వ్యక్తులు దిగారు... కళ్లు చెదిరిపోయే నగలు... వేల రూపాయల ఖరీదైన గుడ్డలు అసాధారణమైన అలంకరణలు .. రంగన్న ఈర్ష్యగా చూస్తున్నాడు - తనకూ రామికీ ఈ అదృష్టం లేదే !

రామి గాజు కూజాతో మంచి నీళ్లు తెచ్చి గ్లాసులు నింపుతున్నది .

రంగన్న త్రీహార్సెస్ సారాయంతో గ్లాసులు నింపుతున్నాడు .

ఆడవాళ్ళూ మగవాళ్ళూ త్రీకాజిల్స్ త్రాగుతూ ఏమిటేమిటో మాట్లాడుతున్నారు - పొగవలె గుప్పు గుప్పున వలయాలు తిరుగుతున్నాయి వాళ్ళ మాటలు. అయ్యగారూ అమ్మగారూ ఆ ఆనందంలో భాగం పంచుకున్నారు...

విందు ఘనంగా ముగిసింది....వచ్చిన గౌన్లూ, సూట్లూ వచ్చిన చోటికే వెళ్ళిపోయాయి.

విందులో ఎంతో కృత్రిమంగా లేని ఆప్యాయతనంతా వొలకపోసిన అయ్యగారూ అమ్మగారూ రుస రుసమంటూ చెరొక గదికి వెళ్ళిపోయి పడుకున్నారు.... రామి ఆశ్చర్యపోయింది!

ఎంతనటన! ఎవరికోసమీ నటన? ప్రేమ కూడా తమకోసం కాక లోకం సంతృప్తికొరకేనా? ఏమి జీవితమిది??....

చీకటి దట్టంగా వ్యాపించింది, అంతా నిద్రపోయారు....

తెల్లవారుతుండగానే ఎవరో గుమ్మం దగ్గర ఏడుస్తున్నారు ...

రామి వెళ్ళి తలుపు తీసింది.

ఎవరో రైతు ...కన్నీళ్ళు కారుస్తూ లోనికి ప్రవేశించాడు-

అతన్ని ఓదార్చి సంగతేమిటని అడిగింది....

'అమ్మగారు కావా'లన్నాడు-

కన్నులు నులుపుకుంటూ కిటికీనుండి ఇవతలికి చూచింది...

ఏడుస్తు రైతు నమస్కారం పెట్టాడు.

మత్తుగా అమ్మగారు ఒళ్లు విరుచుకున్నది-ఊడిపోతున్న జాకెట్ గుండీలు సర్దుకున్నది - మెడలవరకూ ఉన్న జుత్తును ముందునుండి వెనుకకు విసిరివేసి ఏమిటన్నట్లు చూచింది.

వాడు ఏడుస్తూ చెపుతున్నాడు "నా బిడ్డలు చచ్చిపోయిన్రమ్మగారూ-అమ్మ తల్లి ముగ్గురు బిడ్డల్నీ ఎత్తుకుపోయినాది" కలరాతో మరణించిన తన సంతానం గూర్చి విలపిస్తున్నాడు వాడు-

అమ్మగారు గదినుండి ఇవతలికి వచ్చింది....

అతని ఏడుపు తెరలు తెరలుగా వస్తున్నది....

రామి ఓదారుస్తున్నది-

అమ్మగారు ప్రశ్నించింది "ఏం చేయమంటావయితే...."

'అమ్మా - నా బిడ్డలకి పానంపొయ్యమ్మా' వాడు విలపిస్తూ అన్నాడు-

అమ్మగారు అన్నది 'చచ్చినవాళ్ళెట్లా బతుకుతారయ్యా - నేను పిల్లలు పుట్టకుండా చేయగలనే కాని - చచ్చినవాళ్ళను బ్రతికించలేను'

'అమ్మ! దానికి నీవు పేగుతిరగవేయించినావుగంద! నాకిక సంతానంకలు గదా?' నిరాశతోనే అడిగాడు వాడు....

'లేదు' సాలోచనగా జవాబిచ్చింది 'అమ్మగారు'... రైతు మళ్ళీ ఏడుస్తున్నాడు....

'ఏడవకు ఏమిటీ గోల పొద్దున్నే?.... నీకు పిల్లలు పుడుతారులే-పో'.

'నిజమా? ఎట్లా?' రైతు ప్రశ్నించాడు.

'వీర్యదాత నొకడిని చూస్తాను'

'అంటే?' అంత దుఃఖంలోనూ ఆసక్తిగా ప్రశ్నించాడు.

అమ్మగారు కొంచెం ఓపికతో వివరించింది ఆ పద్ధతి. దానితో రైతు కోపం తారాపథాన్నందుకున్నది. అప్రయత్నంగా వాడి చేతిలోని కర్ర పైకి లేచింది. సమయానికి రంగయ్య వచ్చి అమ్మగారిని కాపాడాడు....

రైతును బయటకు నెట్టి గేటు వేశాడు రంగయ్య. ఏడుస్తూ అర్థమైన తిట్లూ తిట్టుకుంటా రైతు వెళ్ళిపోయాడు....

చికాకుగా అమ్మగారు లోనికి నిష్క్రమించింది.

ఆ రాత్రి....అమ్మగారికీ అయ్యగారికీ మధ్య తీవ్రమైన ఘర్షణ జరిగింది.... ఆ వేడితోనే ఇద్దరూ తమ తమ పక్కలను ఆశ్రయించారు....

మరునాడు ఉదయం కాఫీ త్రాగుతూ అయ్యగారు ప్రశ్నించాడామెను ఇంగ్లీషులో.

అమ్మగారు జవాబు చెప్పింది తీవ్రంగా....

'నీవు ఆపరేషన్ చేయించుకోవాలి' అన్నాడాయన.

'లేదు-మీరే చేయించుకోండి'

ఆయన అన్నాడు 'నేను చేయించుకొన్నా ఆపరేషన్ సక్సెస్ కాకపో వచ్చు - కావడంలేదు కూడాను - అలాంటప్పుడు నీవు గర్భవతివైతే మన మన స్పర్థలు తీవ్రస్థాయికి చేరుకుంటాయి' - విసురుగా లేచి నిలబడి ఆమె అన్నది 'అంత అనుమానంతో మనం సంసారం చెయ్యడమే అనవసరం'

పేలవంగా నవ్వి అతడన్నాడు 'నటన....మనదంతా నటన - నిజంగా ఇక్కడ సంసారం ఉన్నదనే అంటావా?'

'అయితే ఆ నటనకు ముగింపు చేయడం మంచిది'

విసురుగా మేడమీదికి వెళ్ళిపోయింది.

అయ్యగారు చేతిలో ప్లాస్టిక్ అగ్గిపెట్టె నలిగిపోయింది.

రంగన్న బిత్తరబోయి చూస్తున్నాడా దృశ్యాన్ని....

ఆ మరునాడే కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నారిద్దరూ....

రంగన్న నిర్లిప్తంగా ఒక జడ ప్రకృతివలె సాక్షీభూతుడై నిలబడ్డాడు.

కాలచక్రం తిరిగిపోతున్నది-అయ్యగారు వెళ్ళిపోయారెక్కడికో... అమ్మ గారి ప్రవర్తన శ్రుతిమించింది....విందులు వినోదాలు, నైటుక్లబ్బులు, బాత్ రూం డాన్సులు .......

చూస్తుండగానే ఆమెను ఉద్యోగంలో డిప్రమోట్‌చేసి ఒక పల్లెటూరికి ట్రాన్స్‌ఫర్ చేశారు పై అధికారులు... ఆమె వెళ్ళేనాడు ఒక్క ప్లిమత్ కారూ మ్రోగలేదు, ఒక నైలాన్ గౌనూ వీడ్కోలు చెప్పలేదు...ఒక్క వులెన్ సూటూ ఆతిథ్యమిచ్చి సాగనంపలేదు....

కాలచక్రం తిరిగిపోతూనేవున్నది.

శరత్కాలం.... తెల్లవారుజాము.

ఆకాశంలో చంద్రుడు మత్తుగా, చల్లని కిరణాలతో నేలను తడుపు తున్నాడు.

ఊయెలలో చంద్రబింబంలాంటి రామికొడుకు నిద్రపోతున్నాడు.

రంగడేదోమాట అన్నాడు - దానితో రామికి కోపంవచ్చి మూతి బిగించు కుంది.... మళ్ళీ మరో ఛలోక్తి విసిరాడు.

'ఫో, మావా' అంటూ అతని కౌగిటిలోకి ఒదిగింది. తోటలో వాళ్ళ గుడిసె పక్కనున్న మామిడి చెట్టు గలగల కదిలింది.

ఎదురుగా వున్న పున్నాగ పూలు జలజలా రాలాయి.

కొత్తగా వచ్చిన ఆఫీసరూ ఆయన భార్యా పిల్లలూ నిద్రపోతున్నారు... అయన తండ్రి పాడుతున్న భాగవతంలోని పద్యాలు తరంగాలు తరంగాలుగా గాలిలో కలుస్తున్నాయి.

రంగడు గుసగుసవలె ప్రశ్నించాడు 'రామీ, మన జీవితం గొప్పది కాదంటావా ?'

రామి నవ్వుతూ అన్నది 'అని ఓరన్నారు మాఁవా ? - చూచినాముగా మొన్నటి అయ్యగారినీ, అమ్మగారినీ -' మెటికలు విరిచింది.

'అందరూ నేడింతే. కాలం మారిపోయింది మాఁవా' పెద్ద వేదాంతిలా అన్నదీ మాట. అయితే రామి చేసిన నిర్వచనాన్ని రంగ డంగీకరించలేదు.

'అందరూ అంతకాదు రామీ. కొంద రిదిగో ఇలాంటి వాళ్ళూ ఉన్నారు.' కొత్తగా వచ్చిన ఆఫీసరు కుటుంబాన్ని ఉద్దేశిస్తూ అన్నాడు.

ఒక్క క్షణం నిశ్శబ్దం ఆ గుడిసెను పరిపాలించింది.

రామి గుడిసె నొక్కసారి నిర్లిప్తంగా చూచింది -

రంగ డన్నాడు 'మనకంటే, ఆ మొదటోళ్ళు అన్ని విధాలా తక్కువోళ్ళే రామీ నేనే మోసపోయాను. ఆ మిలమిలలూ, కళకళలూ చూచి, అడ సుఖం లేదు - లేనేలేదు అదంతా ఉత్త కాగితంపూల వ్యవహారం - సుఖం, ఇదిగో ఈడ వున్నది...' రామిని చూపుతూ అన్నాడు.

'పో మావా' అన్నది రామి.

'ఔను రామీ - సుఖం డబ్బులోనూ, మోసగించుకోవడంలోనూ లేదు - అది మనసులో వుంది. మన మమకారంలో వుంది -' ప్రేమతో ఎంతో బరువుగా అన్నాడీ మాటలను. ఆకాశంపై చంద్రుడు నవ్వుతున్నాడు - ఊయెలలో రామి కొడుకు తెలియకుండానే నిద్రలో బోసినవ్వు నవ్వుతున్నాడు.